క్లుప్తంగా

పరామర్శ



చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తొట్ల రాజయ్య కాలు ఇటీవల ప్రమాదవశాత్తు విరిగింది. దీంతో బాధితుడిని ఆదివారం పీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన గౌడుగు ఆగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, కంకణాల శంకర్, కంచర్ల రాములు, ఎలవేన శివశంకర్, రాజు ఉన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



చిట్యాల: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని జడల్‌పేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని అమిరిశెట్టి రాజుకు చెందిన దుక్కిటెద్దు ఉదయం గ్రామ శివారులో మేత కోసం వెళ్లింది. మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్ తగిలి విద్యుత్ షాక్ గురై మృతి చెందినట్లు తెలిపారు. ఎద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

నేటి ప్రారంభోత్సవాలు వాయిదా

శాయంపేట : నేడు (సోమవారం) మండలంలోని జోగంపల్లి, కొప్పుల గ్రామాల నడుమ నిర్మించిన బ్రిడ్జి, కొప్పులలో ఎస్సీ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమాలు వాయిదా వేసినట్లు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ గుండెపోటుతో మరణించిన క్రమంలో సంతాపం ప్రకటిస్తూ మండలంలో ఎమ్మెల్యే పర్యటనను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. త్వరలోనే ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్టు వివరించారు.రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు గమనించాలని సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన దివ్యాంగులు

నర్సంపేట: దివ్యాంగులకు సీఎం కేసీఆర్ పెంచడంపై సంతోషం వ్యక్తం చేస్తూ దివ్యాంగుల సంక్షేమ సంఘం బాధ్యులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగులకు రూ.వెయ్యి పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దివ్యాంగుల సంక్షేమ సంఘం నర్సంపేట నియోజకవర్గ అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, నూకల కృష్ణమూర్తి, రుద్రారపు రజిత, ఊర్మిళ, ప్రభాకర్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ..



తడిసిన ధాన్యం బస్తాలు



ధాన్యం బస్తాలపై పరదాలు కప్పిన రైతులు

- కొనుగోలు కేంద్రాల్లోనే నిలిచిపోయిన ధాన్యం
- నెల రోజులుగా కొనసాగుతున్న కొనుగోళ్లు

మహాముత్తారం: ఒకవైపు ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటే మరోవైపు అన్నదాతలు తమ పంటను అమ్ముకునేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. సుమారు నెల క్రితం ప్రారంభమైన కొనుగోలు కేంద్రాల్లోనే నేటికి ధాన్యం నిలువలు పేరుకుపోయి ఉన్నాయి. వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ కల్లాల్లోనే ఉంటున్నాయి. తరుగు పేరుతో ఒకవైపు కోత పెడుతున్న అన్నదాతలు చేసేదేమి లేక ఎదురు చెప్పడం లేదు. పంట పండించేందుకు ఎంతకష్ట పడ్డామో దాన్ని అమ్ముకునేందుకు అంతకంటే ఎక్కువ కష్టపడాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 9 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటి వరకు 40వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా ఆయా కొనుగోలు కేంద్రాల్లో సుమారు 4వేల క్వింటాళ్లు కొనుగోలు చేయాల్సి ఉందని పీఏసీఎస్ సీఈఓ మార్క శ్రీధర్ తెలిపారు.

లారీల కొరతతో నిలిచిన కొనుగోళ్లు

కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు కావాల్సిన లారీలు లేకపోవడంతోనే కొనుగోళ్లు నిలిచి పోయినట్లు సమాచారం. కల్లాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాహకులు బలవంతంగా ప్రదాన రహదారులపై వెళ్లే బొగ్గు లారీలను దారి మళ్లించి ధాన్యాన్ని తరలించే దుస్థితి ఏర్పడింది.

రైతులను వెంటాడుతున్న వరుణుడు

పంట పండించే సమయంలో కురువాల్సి వర్షం ధాన్యాన్ని కల్లాల్లో పోసిన నాటి నుంచి అకాల వర్షం రూపంలో పలు మార్లు రావడంతో అన్నదాతల ధాన్యం బస్తాలు తడిచిపోతున్నాయి. ఇప్పటికే పలుమార్లు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వర్షార్పణమైంది. ఈ శాన్యరుతుపవనాలు సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికైన కొనుగోళ్లను వేగవంతం చేపట్టి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని రైతులు వేడుకుంటున్నారు. ఈ విషయమై పీఏసీఎస్ సీఈఓ మార్క శ్రీధర్‌ను వివరణ కోరగా లారీల కొరతతో పాటు రైసుమిల్లుల్లో ధాన్యం దిగుమతి కాకపోవడం కొనుగోళ్లకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి కాంట్రాక్టర్స్ భవనంలో ఆదివారం ఐజేయూ ద్వితీయ సభలను నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో తమ వంతు కృషి చేస్తున్నానని ఇప్పటికే కొంత మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మిగిలిన వారందరికి సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులు కుడా వాస్తవాలను పరిగనలోకి తీసుకొని వార్తలను రాయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఐజేయూ జిల్లా అధ్యక్షుడిగా క్యాతం సతీష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సామంతుల శ్యామ్, కోశాధికారిగా చింతల కుమార్‌యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా సామల శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా రజినీకాంత్, చిన్న పత్రిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా కుసుమ చంద్రశేఖర్, జర్నలిస్టులపై దాడుల వ్యతిరేక కమిటీ కన్వీనర్‌గా కరెంగుల శ్రీనివాస్, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి, స్థానిక జర్నలిస్టులు ప్రభాకర్, సమ్మయ్య పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

కాటారం: కాటారం మండలం వీరాపూర్, ఒడిపిలవంచ, జాదారావుపేట గ్రామాల్లో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. సుమారు మూడు గంటల పాటు ఈదురుగాలితో వర్షం పడటంతో గ్రామాల్లో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. గాలివాన బీభత్సానికి రవికి చెందిన పౌల్ట్రీ ఫాం షెడ్ కుప్పకూలిపోయింది.



గాలివానకు కూలిన షెడ్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మహదేవపూర్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మల్హర్: మండలంలోని ఇప్పలపల్లి(గౌరమల్లయ్యపల్లి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2001–06 సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన నాటి ఉపాధ్యాయులను శాలువాతో ప్రత్యేకంగా ఘనంగా సన్మానించారు. అనంతరం ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ముఖ్య అతిథులుగా కొయ్యూరు సేష్టన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన సమయంలో పాఠశాల కట్టించి, ప్రస్తుతం హైదరాబాద్‌లో డీస్పీగా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్‌రెడ్డి, పాఠశాలలో గతంలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన లక్కాకుల కోటేశ్వర్ రావు, ఆజ్మీరా రవినాయక్, ఉపాధ్యాయుడు గుడెపల్లి సంపత్‌లు పాల్గొన్నారు.



మల్హర్‌లో..

మహదేవపూర్: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ పాఠశాలలో 1990–91 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నానాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అరుణ, సర్పంచ్ శ్రీపతిబాపు పీఏసీఎస్ వైస్ చైర్మన్ అనిల్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అంకమ్మ, దేవేందర్, సత్యనారయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోటగుళ్లలో సాహిత్య దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అడిషనల్ కలెక్టర్ దివాకర



రచయిత మిట్టపల్లి సురేందర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహిత్య దినోత్సవం, కవి సమ్మేళన కార్యక్రమం ఆదివారం రాత్రి గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల ఆవరణలో వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ దివాకర, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు తెలంగాణ ఉద్యమం, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, ఇతరత్ర అంశాలపై కవితలను చదివి వినిపించారు. సద్గురు శివనందా నృత్య రూపాకం, చిట్యాల మండల వాస్తవ్యులు మిట్టపల్లి సురేందర్ గాన లహరి, ఇతర కవుల రచనలు, ఉపన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. సాహిత్య వేడుకలలో తెలుగు భాషలో పద్య, వచన కవిత పోటీలు, ఉర్దూ భాషలో కవిత పోటీలు నిర్వహించగా ఐదుగురు సభ్యులతో జడ్జిల కమిటీని నియమించి ఐదు ఉత్తమమైన కవితలను ఎంపిక చేసి తెలంగాణ భాష సంస్కృతిక శాఖకు పంపించనున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీపీఆర్ఓ శ్రీధర్, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్ డీపీఓ ఆశాలత, డీఆర్‌డీఓ పురుషోత్తం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సాహిత్య ఉత్సవాల్లో నృత్యం చేస్తున్న కళాకారులు

గ్రామ కమిటీ ఎన్నిక

మల్హర్: మండలంలోని మల్లారంలో కాంగ్రెస్ పార్టీ మహిళా గ్రామ కమిటీని మండల అధ్యక్షురాలు, మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గుగులోతు నిర్మల, ఉపాధ్యక్షురాలిగా శ్రీలం సారమ్మ, ప్రధాన కార్యదర్శిగా కడారి రజిత, కోశాధికారిగా నక్క తిరుమల, సంయుక్త కార్యదర్శిగా సింగనవేన స్వప్న, ప్రచార కార్యదర్శిగా ముక్కరవేన స్వప్న, గౌరవ అధ్యక్షురాలిగా గిరినే భాగ్యమ్మ, అధికార ప్రతినిధిగా పిట్టల స్వరూప, సలహదారులుగా మీసాల రజిత, ముఖ్య సలహదారులుగా శారద, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆవిర్నేని ప్రకాష్‌రావు, గ్రామశాఖ అధ్యక్షుడు నెరదిగొమ్మ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

2కే రన్‌ను విజయవంతం చేయాలి

ఆత్మకూరు : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నేడు (సోమవారం) తలపెట్టిన నియోజకవర్గ స్థాయి 2కే రన్‌ను విజయవంతం చేయాలని ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక ఏసీపీ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రన్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రన్‌లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహా పలువురు ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, ప్రజలు పాల్గొనాలని కోరారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మహాముత్తారం: దివ్యాంగులకు వచ్చే నెల నుంచి రూ.1000 పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో వికలాంగుల మండలశాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆదివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు బందం పుల్లయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ నాయకులు, దివ్యాంగులు ఉన్నారు.

దుస్తుల పంపిణీ



పిల్లలకు దుస్తులు అందజేస్తున్న పద్మారావు

మంగపేట: మండల కేంద్రంలోని శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యాలు చేసిన పిల్లలకు కమలాపురం గ్రామానికి చెందిన నల్లూరి పద్మారావు ఆదివారం నూతన దుస్తులను అందజేశారు. నృత్యప్రదర్శన, డ్యాన్స్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన నలుగురు పిల్లలకు ఆయన దుస్తులు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.10,000 విలువైన దుస్తులను ఆలయ చైర్మన్ మైల నరేష్‌రెడ్డి, కమిటీ సభ్యులు కొమరగిరి కేశవరావు, చాద మల్లయ్య, సురేష్, పూర్ణచందర్, ఆలయ అర్చకులు నరేష్‌శర్మ ఆధ్వర్యంలో అందజేశారు.

జెడ్పీ చైర్మన్ మృతికి సంతాపం



వెంకటాపురం(కె): సంతాపం తెలుపుతున్న నాయకులు



ములుగు: జగదీశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న భిక్షపతి గౌడ్

ములుగు/ములుగు రూరల్: గుండెపోటుతో మృతి చెందిన జెడ్పీ చైర్మన్ జగదీశ్‌కు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు నివాళులర్పించారు. ప్రజా సంఘాల అధ్యక్షుడు జేఏసీ అధ్యక్షుడు భిక్షపతి గౌడ్, డాక్టర్ పోరిక రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్, యూత్ నాయకుడు ఒజ్జెల కుమార్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ పీఏసీఎస్ డైరెక్టర్ బోయిని రాజు, అజహర్, రాజాహుస్సేన్ మృతదేహం వద్ద సంతాపం తెలిపారు. మంచినాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

వెంకటాపురం(కె): జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మృతికి మండలంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో జెడ్పీ చైర్మన్ జగదీశ్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, మండల కార్యదర్శి శెట్టి మురళి, నాయకులు బాలసాని వేణు, జాగర శాంతమూరర్తి, మద్దుకూరి ప్రసాద్, గాందర్ల నాగేశ్వరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సెన్, ఎంపీటీసీ గార్లపాటి రవి, సీపీఎం నాయకులు కుమ్మరి శ్రీను విజయ్ తదితరులు ఉన్నారు.

మంగపేట: జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీశ్వర్ మృతి వార్త విన్న మండలంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఒక్క సారిగా దిగ్భ్రాంతి చెందారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కుదుముల లక్ష్మీనారాయణ, మంగపేట ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ తోట రమేష్, వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, జిల్లా సీనియర్ నాయకులు వత్సవాయి శ్రీధర్ వర్మ తదితరులు జగదీశ్‌తో ఉన్న సన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశాడాని గుర్తు చేసుకున్నారు. కడసారిగా ఆయనను చూసేందుకు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు జగదీశ్ స్వగ్రామం మల్లంపల్లికి తరలివెళ్లారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మృతిపై పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, పూజారులు ప్రగాఢ సానూభూతి తెలిపారు. జెడ్పీచైర్మన్‌గా మేడారం సమ్మక్క –సారలమ్మ జాతర అభివృద్ధికి, రెండు జాతరలను విజయవంతం చేయడంలో ఎంతో కృషి చేశాడని ఆయన సేవలను గుర్తు చేశారు. ఆయన మృతిపై సంతాపం ప్రకటిస్తున్నట్లు పూజారులు తెలిపారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీ చైర్మన్ జగదీష్‌కు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జగదీశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లంపల్లిలో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, ఖాజాషాషా, చిన్నికృష్ణ, స్వరూప, కూనూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేనా?



నిర్మాణ దశలో ఉన్న కొంగల వాగు బ్రిడ్జి



నిర్మాణ దశలో ఉన్న గాజుల ఒర్రె బ్రిడ్జి

- ప్రారంభ దశలోనే కొంగల వాగు బ్రిడ్జి
- పూర్తికాని గాజుల ఒర్రె వంతెన
- వర్షాలు పడితే నిర్మాణాలకు అడ్డంకి
- 25 గ్రామాలకు రాకపోకలు బంద్

వాజేడు: వాజేడు, గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్యన కొంగల వాగుపై బ్రిడ్జి మంజూరైంది. పనులను వర్ష కాలం రాక ముందే పూర్తి చేయల్సి ఉంది. కానీ అవగాహన లోపమో లేక చిన్న వాగే అని కాంట్రాక్టర్ అనుకున్నాడో అర్థం కావడం లేదు కాని నిర్మాణ పనులను ఆలస్యంగా మొదలు పెట్టాడు. పనులు ఇప్పుడే మొదలు పెట్టడం, ఒక వైపు రుతుపవనాలు వస్తుండటంతో పూర్తి కాదని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిందంటే సమీప గుట్టలపై నుంచి కొంగల వాగు పొంగి ఉధృతంగా ప్రవహిస్తుంది. పాత బ్రిడ్జి ఉన్నప్పుడే వర్షాలు బాగా పడితే మండల కేంద్రానికి 25 గ్రామాల నుంచి రాక పోకలు నిలిచిపోయేవి. అలాంటిది ఇప్పుడు బ్రిడ్జి పనులు పునాదుల వద్దనే ఉండటంతో ఈ వర్షాకాలం మొత్తం పనులు సాగే అవకాశం లేదు. దీంతో ఈ వర్షాకాలం మొత్తం మండల కేంద్రానికి వాగు అవతలి వైపున ఉన్న గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయే పరిస్థితి ఉంది. ఈ 25 గ్రామాల ప్రజలు జగన్నాథపురం గ్రామం మీదుగా వాజేడు మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. దీనికి తోడు మండల కేంద్రాన్ని ఆనుకుని గాజుల ఒర్రెపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు కూడా ఇంకా పూర్తి కాలేదు. పనులు నత్త నడకన కొనసాగుతుండటంతో ఈ బ్రిడ్జి కూడా వర్షాలు పడే లోగా పూర్తయ్యే అవకాశం లేదు. రైతులు కూడా ఈ రెండు బ్రిడ్జిలను దాటుకుని వ్యవసాయ పనులకు వెళ్లాల్సి ఉంటుంది. బ్రిడ్జిల నిర్మాణ పనులు పూర్తి కాకపోతే వందలాది మంది రైతులు వాజేడు నుంచి జగన్నాథపురం, గుమ్మడిదొడ్డి గ్రామాల మీదుగా సుమారుగా 8 కిలో మీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తుంది.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రం సమీపంలోని కామారం గ్రామానికి చెందిన రేగ నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పార్టీ నాయకులు పరామర్శించి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాను సారంగా ఆర్థిక సాయం అందజేసినట్లు దేవేందర్ తెలిపారు. సర్పంచ్‌లు ఇర్ప సునీల్, రేగ కల్యాణి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు పార రాజేందర్, డైరెక్టర్ రంగరబోయిన జగదీశ్, అనుమాండ్ల రాజీరెడ్డి, నాగారాజు పాల్గొన్నారు.